క్లుప్తంగా

శ్రీలతకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ అవార్డులు



అవార్డు అందుకుంటున్న శ్రీలత

నేరేడుచర్ల : నేరేడుచర్ల హరివిల్లు క్లబ్ అధ్యక్షురాలు వీరవల్లి శ్రీలత ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ అత్యుత్తమ పురస్కారమైన రీజినల్ బెస్ట్ క్లబ్ అధ్యక్షురాలుగా, స్పీకర్ కాంటెస్ట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఆ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంపా నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శ్రీలత సేవలను గుర్తించిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ వ్యవస్థాపకుడు గంపా నాగేశ్వర్‌రావు, జీవీ శ్రీరామ్ అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. ఇంపాక్ట్ ట్రైనర్ బాల సురక్ష వలంటర్‌గా విజ్ఞానాన్ని నలుగురుకు పంచుతూ పేద వర్గాల ప్రజలకు సేవలందిస్తూ సేవారంగంలో మరింత రాణిస్తానని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ వార్డులతో తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా చేపలు పట్టడం సరికాదు

గరిడేపల్లి : కాంట్రాక్టర్లు నిబంధనల మేరకు చేపలు పట్టాలని, అందుకు విరుద్ధంగా చేపలు పట్టడం సరికాదని బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు జోగు అరవింద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోనుగోడులో ఆయన మాట్లాడారు. బయటి నుంచి మత్స్యకారులను తీసుకువచ్చి అదనంగా డబ్బులిచ్చి పనిచేయించుకోవడం ఇక్కడి మత్స్యకారులను మోసం చేయడమే అన్నారు. గ్రామంలోని మత్స్యకారులందరికీ చేపలు పట్టడం వచ్చని, అలాంటప్పుడు బయటి వారితో చేపలు పట్టించడం ఏంటని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల నిబంధనల ఉల్లంఘనను నివారించేందుకు కఠినమైన చట్టాలను అమలు చేయాలని, మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు.

మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానకార్డు అందజేత



మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వాన కార్డు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని గోపాలపురంలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 20నుంచి 22వతేదీ వరకు హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. కాగా ఆదివారం హుజూర్‌నగర్ పర్యటనలో ఉన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య కలిసి వేడుకలకు హాజరు కావాలని ఆహ్వానం కార్డు అందజేశారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా కడియాల అప్పయ్య



గరిడేపల్లి : మండలంలోని గానుగబండ గ్రామంలో ఆదివారం సీపీఐ మండల మహాసభ నిర్వహించారు. ఈ సభలో పార్టీ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కడియాల అప్పయ్య, సహాయ కార్యదర్శిగా పోటు పూర్ణచందర్‌రావుతో పాటు మరో 7గురిని కార్యవర్గ సభ్యులుగా, 18మందితో నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కడియాల అప్పయ్య మాట్లాడారు. మండల ప్రజల సమస్యలపై పోరాటాలు చేయడంతో పాటు మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో త్రిపురం సుధాకర్‌రెడ్డి, పోకల ఆంజనేయులు, షేక్ పీర్‌సాహెబ్, వంగ సైదులు, మెండే లింగరాజు, తాళ్ల తిరపయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ పరామర్శ



కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ యరగాని గురవయ్యగౌడ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో శనివారం మృతి చెందారు. ఆదివారం మృతుడి కుటుంబాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు తన్నీరు మల్లికార్జున్‌రావు, దొంతగాని శ్రీనివాస్, రవినాయక్, సైదులునాయక్, యరగాని శ్రీనివాస్, సత్యనారాయణ, కాసాని శ్రీను, సత్యం, రాంబాబు, రమేష్ ఉన్నారు.

చేతి పంపులకు మరమ్మతులేవీ !

- పలు గ్రామాల్లో నీటి ఎద్దడి
- నీటి కోసం ఇబ్బందులు
- చేతి పంపులకు మరమ్మతులు చేయాలని ప్రజల వేడుకోలు



బూరుగడ్డలో చేతిపంపు పనిచేయకపోవడంతో మోటారు బిగించిన గ్రామస్తులు



లింగగిరి శివారులో నిరుపయోగంగా చేతిపంపు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లక్కవరం, బూరుగడ్డ, వేపలసింగారం, గోపాలపురం, లింగగిరి తదితర గ్రామాల్లో చేతిపంపులు మరమ్మతులకు గురయ్యాయి. అనేక ఏళ్లుగా చేతి పంపులు నిరుపయోగంగా ఉన్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో పలు గ్రామాల్లో తాగు నీటి కొరత ఏర్పడింది. దీంతో ప్రజలు నిత్యావసరాలకు, పశువులకు తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. దీంతో కార్యదర్శులు గ్రామాల్లో నీటి కొరత రాకుండా చూస్తున్నారు. పంచాయతీల్లో నిధులు లేక తమపై కొంత ఆర్థిక భారం కూడా పడుతుందని అంటున్నారు. అయితే చేతిపంపులకు మరమ్మతులు చేయించాలంటే ఒక్కొక్క దానికి రూ.3 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు అవుతుంది. సొంత డబ్బులతో మరమ్మతులు చేయించినా అధికారులు బిల్లులు ఇవ్వరని పనులు చేయడానికి గ్రామాధికారులు ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. ఇక గ్రామాల్లో ప్రత్యేక అధికారులు ప్రజా సమస్యలను అసలు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చేతి పంపుల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజల దాహార్తిని తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



“చేతి పంపుల మరమ్మతులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. వేసవి కాలం దృష్ట్యా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా అత్యవసర సమయంలో చేతిపంపులను వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలి. మరమ్మతులకు గురైన చేతి పంపులను బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలి

– మాదుగుల పరుశురాం, బూరుగడ్డ

సొంత డబ్బులతో మరమ్మతులు చేయిస్తున్నారు



“మండలంలో అవసరమైన చేతిపంపులకు మరమ్మతులు చేయించి తాగునీరు అందిస్తున్నాం. చేతి పంపుల మరమ్మతులకు ప్రత్యేక నిధులు రాలేదు. గ్రామ పంచాయతీ నిధుల నుంచే మరమ్మతులు చేయించి వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం జీపీల్లో నిధులు లేకపోవడంతో కార్యదర్శులు సొంత డబ్బులతో చేతి పంపుల మరమ్మతులు చేయిస్తున్నారు. మండలంలో సుమారు 168 చేతి పంపులు ఉండగా, 16 మరమ్మతులకు గురయ్యాయి.

– శ్యామల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, హుజూర్‌నగర్

మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి



భూములను పరిశీలిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : అగ్రికల్చర్ యూనివర్సిటీ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని బూరుగడ్డలో యూనివర్సిటీ నిర్మాణం చేపట్టే భూములను మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్‌తో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో 100ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిని బడుగు, బలహీన వర్గాలకు సుమారు 50మందికి పైగా రైతులు 70సంవత్సరాలకు పైగా సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజలు, రైతులు అభిప్రాయాన్ని సేకరించి స్పష్టమైన హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ పేరుతో పేదల ఆధీనంలో ఉన్న భూమిలో నిర్మాణం చేపట్టాలని ఇటీవల అధికారులు సర్వే చేశారని, ఎలాంటి ఆధారం లేని రైతుల భూములను ప్రభుత్వం తీసుకుంటే మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించడంతో పాటు యూనివర్సిటీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. వారి వెంట రైతు సంఘం మండల అధ్యక్షుడు మీగడ రాములు, నాయకులు ఆవుల సైదులు, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన



చిలుకూరు మండలంలోని జానకీనగర్ రోడ్డు

చిలుకూరు : మండలంలో మరో సింగిల్ లైన్‌గా ఉన్న బీటీరోడ్డును డబుల్ లైన్‌గా మార్చేందుకు నిధులు మంజూరయ్యాయి. కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ ఎస్ఎస్‌పీ కాలువ నుంచి మండల పరిధిలోని జానకీనగర్, దూదియాతండా, సీత్లాతండా, నారాయణపురం మీదుగా కోదాడరూరల్ మండలంలోని భీక్యాతండా వరకు రూ.10కిలోమీటర్ల వరకు డబుల్ లైన్ రోడ్డుగా మారనుంది. ఈ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే పద్మావతితో కలిసి నారాయణపురం గ్రామంలో శంకుస్థాపన చేయనున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డు డబుల్ రోడ్డుగా చేపట్టాలని ప్రతిపాదనలకే పరిమితం కావడం తప్పా నిధులు మాత్రం మంజూరు కాలేదు. నేడు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి ఆర్‌అండ్‌బీ నుంచి నిధులు మంజూరు చేయించి డబుల్ రోడ్డుగా మార్చేందుకు కృషిచేశారు. దీంతో 10కిలోమీటర్లకు గాను ఆర్‌అండ్‌బీ నిధుల నుంచి రూ.20కోట్ల40లక్షల మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ రోడ్డు సింగిల్ రోడ్డుగా ఉండడంతో వాహనదారులు ప్రయాణాలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుఎదురుగా వాహనాలు వస్తే పక్కకు తొలగడం చాలా ఇబ్బందిగా మారుతుంది. అదే విధంగా ఈరోడ్డులో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుండడంతో రద్దీగా ఉంటుంది. సింగిల్ లైన్ నుంచి డబుల్ లైన్ రోడ్డుగా మారనున్న ఈ రోడ్డు 7మీటర్ల బీటీతో పాటు రోడ్డు ఇరుపక్కల కలిపి 3మీటర్ల మేర మట్టి రోడ్డు ఉండనుంది. మొత్తం 33ఫీట్లుగా రోడ్డును విస్తరించనున్నారు.

చెరువు మట్టిని తరలించొద్దని ఆందోళన



గ్రామస్తులతో మాట్లాడుతున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది

అనంతగిరి : మండల పరిధిలోని త్రిపురవరం గిద్దెకుంట చెరువు నుంచి ఓ కాంట్రాక్టర్ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా చెరువుమట్టి తవ్వకాలు చేపట్టారు. దీంతో ఆ గ్రామస్తులు చెరువు నుంచి మట్టిని తరలించొద్దంటూ ఆదివారం ఆందోళన చేపట్టి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. గ్రామ అవసరాలకు, రైతులకు మట్టి అవసరం ఉన్నందున గిద్దెకుంట చెరువులో ఎటువంటి మట్టి తవ్వకాలు చేపట్టొద్దంటూ అడ్డుకున్నట్లు తెలిపారు. అంతేకాక సదరు కాంట్రాక్టర్‌కు మట్టి తవ్వేందుకు ఎటువంటి అనుమతులు లేవని ఉంటే చూపించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గ్రామస్తుల రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్ మాట్లాడుతూ.. రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిలో కాంట్రాక్టర్‌కు మట్టి తవ్వేందుకు అనుమతులు ఉన్నట్లు తెలిపారు. దీంతో అధికారులకు గ్రామస్తులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మునగాల సీఐ రామకృష్ణారెడ్డి గ్రామస్తులతో మాట్లాడి గ్రామస్తులు శాంతిపజేశారు. గ్రామస్తుల నుంచి వారి డిమాండ్‌లను అడిగి తెలుసుకున్నారు. కాగా చెరువులో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ నిబంధనల మేరకు తవ్వకాలు చేపట్టాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేశారు. అంతేకాక చెరువును పూర్తిగా సర్వేచేయించి హద్దులు ఏర్పాటు చేయాలని, గ్రామంలో రోడ్ల వెంట దుమ్మురాకుండా ట్యాంకర్‌తో నీటిని చల్లించాలని కోరారు. నిబంధనల ప్రకారం సదరు కాంట్రాక్ట్ పనులు చేసుకోవాలని సీఐ రామకృష్ణారెడ్డి సూచించారు. ఆయన వెంట నడిగూడెం ఎస్ఐ గండమళ్ల అజయ్‌కుమార్, మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, రెవెన్యూ ఆర్ఐ నగేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

డొంక దారి ఏర్పాటుకు సహకరిస్తా

చిలుకూరు : మండలంలోని జానకీనగర్‌లో వివాదాస్పదంగా మారిన డొంక దారిని తాను అడ్డుకుంటున్నాని, సర్వేకు రావడం లేదని అనడంలో వాస్తవం లేదని, నిబంధనల ప్రకారం చట్టం పరిధిలో డొంక దారిని తీయడానికి తాను పూర్తిగా సహకరిస్తానని మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీనాయక్ అన్నారు. ఆదివారం సాక్షిలో డొంక దారి ఆక్రమణ వివాదాస్పదం అనే శీర్షికతో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ప్రధాన రహదారి నుంచి 327 సర్వే నంబర్‌లో ఉన్న డొంక చివరి వరకు దారిని తీయాలని ఎవరు భూమిని ఆక్రమించుకున్నా దానిని స్వాధీనం చేసుకొని దారి ఏర్పాటు చేయాలని అన్నారు. అందుకు తాము పూర్తిగా అధికారులకు సహకరిస్తామన్నారు. అక్కడ మొత్తం 2ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, దానిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు డొంక దారికి సర్వే హద్దులు నిర్ణయిస్తే తాను తొలగించినట్లు తనకు నోటీసులు ఇచ్చారని, అందులో వాస్తవం లేదన్నారు. తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తనపై మహేందర్ అసత్య ఆరోపణలు చేస్తే రెవెన్యూ అధికారులు ఎలాంటి విచారణ చేయకుండా తనకు నోటీసులు ఇచ్చారని అన్నారు. రెవెన్యూ అధికారులపై చట్టపరంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు, పరువు నష్టం దావా వేస్తానని అన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి



క్రీడలను ప్రారంభించి మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

గరిడేపల్లి : యువత క్రీడలపై దృష్టి సారించాలని, గెలుపు ఓటములతో జీవిత సత్యాలను మనోధైర్యాన్ని సంపాదించుకోవచ్చని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించడంతో యువకుల మధ్య సత్సంబంధాలు ఏర్పడటమే కాకుండా నలుగురు వ్యక్తుల ఆలోచనలు పంచుకునే అవకాశం ఉంటుందన్నారు. వివిధ గ్రామాల నుంచి యువకులు కలిసి ఆటల పోటీల్లో పాల్గొనేందుకు రావడం ద్వారా వారి మధ్య మంచి వాతావారణం ఏర్పడటమే కాకుండా నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. నేటి యువత సెల్‌ఫోన్‌లో ఆటలాడుతున్నారే తప్పా ప్రత్యక్షంగా ఆటలు ఆడడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆటలతో మానసిక ఉల్లాసమే కాకుండా సృజనాత్మకమైన శక్తి కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చలికంటి నరేష్, ట్రైనీ ఎస్ఐ సురేష్‌రెడ్డి, రాయినిగూడెం సహకార సంఘం చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతకాయల సైదులు, క్రీడా నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

గరిడేపల్లి : మండలంలోని వెలిదండ గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 12కుటుంబాలు ఆదివారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, గ్రామ కార్యదర్శి మేకల కనకారావు పార్టీ జెండాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడారు. సంవత్సరం క్రితం పార్టీ నుంచి కొంత మంది నాయకుల మోసపూరిత మాటలతో కాంగ్రెస్‌లోకి వెళ్లారని ఆ పార్టీ విధానాలు నచ్చక తిరిగి సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో గండు శ్రీను, నగేష రాములు, అప్పన్న, చిన్న కోటయ్య, నారాయణ, లక్ష్మయ్య, రాంబాబు, లక్ష్మీ, చంద్రకళ, ఆదిలక్ష్మి, సైదులు, మహేష్, చంద్రకళ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి

మునగాల : జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలంపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల మాఫియా నడుస్తుందని, ఎంబీబీఎస్ సర్టిఫికెట్లు లేకున్నా ఆస్పత్రులు ఏర్పాటు చేసుకొని ప్రజల ప్రాణాలు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గాలలో కూడా అనుమతులు, సరైన పత్రాలు లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నారని అన్నారు. ఇంత దోపిడీ జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న జిల్లా వైద్యాధికారిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరాహార దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–2003 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ గురవయ్య, పూర్వ విద్యార్థులు కందనబోయిన లింగరావు, వడ్రాణపు నరసింహారావు, నెమ్మాది యాదగిరి, బెజవాడ వీరబాబు, సామ్రాట్, ఆదిలక్ష్మి, సునీత, ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలభవన్ సమ్మర్ క్యాంపులో దంత వైద్యశిబిరం



డాక్టర్లను సన్మానిస్తున్న బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణరెడ్డి

సూర్యాపేట : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న బాల్ భవన్ వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సూర్యాపేట అధ్యక్షుడు డాక్టర్ దినేష్ కుమార్, సెక్రటరీ అరుణ్ కుమార్, డాక్టర్ మహేష్, డాక్టర్ చందనలు దంత పరీక్షలు చేశారు. బాల, బాలికలకు టూత్ బ్రష్, టూత్ పేస్ట్‌లను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ మాట్లాడారు. పిల్లలంతా ఉదయం, రాత్రి బ్రష్ చేయాలని, మూడు నుంచి ఆరు నెలల లోపే బ్రష్‌ని మారుస్తూ ఉండాలన్నారు. అనంతరం బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐడీఏ డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాల్ భవన్ సిబ్బంది దాసరి ఎల్లయ్య, సత్యనారాయణ సింగ్, ఉమా, అనిల్, సాయి, వీరయ్య పాల్గొన్నారు.

వరిగడ్డి వాము దగ్ధం

చిలుకూరు : నిప్పంటుకుని వరిగడ్డి వాము దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని నారాయణపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బత్తుల వెంకటేశ్వర్లుకు చెందిన వరిగడ్డి వాముకు ప్రమాదవశాత్తు నిప్పు అట్టుకొని 150 వరిగడ్డి కట్టలు దగ్ధమయ్యాయి. వెంటనే గమనించిన రైతు, చుట్ట పక్కల రైతులతో కలిసి మంటలు ఆర్పివేశారు. అప్పటికే గడ్డి పూర్తిగా దగ్ధమైంది.

వరి కొయ్యకాలను కాల్చొద్దు

నడిగూడెం : ప్రస్తుత వేసవిలో రైతులు వరి కొయ్యకాలను కాల్చొద్దని మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు అవగాహన లేకపోవడంతోనే వరి కొయ్యకాలకు నిప్పంటిస్తున్నారని, దీంతో వాయు కాలుష్యం, భూసారం క్షీణించడం భూసారం బాగా దెబ్బతింటుందన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



జానకీనగర్ రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న బావి

చిలుకూరు : మండలంలోని జానకీనగర్ నుంచి దూదియాతండా, సీత్లాతండా, నారాయణపురం వెళ్లే రోడ్డులో జానకీనగర్ గ్రామ శివారులో సెల్‌టవర్ దగ్గర రోడ్డు పక్క ఉన్న బావి ప్రమాదకరంగా ఉంది. ప్రస్తుతం ఈ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలోరోడ్డు ఇరుపక్కల రోడ్డుకు మట్టి పోస్తూ రోడ్డును వెడల్పు చేస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న బావి ఉన్న ప్రదేశంలోనే మూల మలుపు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని గ్రామస్తులు అంటున్నారు. ఏ మాత్రం వాహనదారులు ఆదమరిచినా మూలమలుపు తిరిగే క్రమంలో బావిలో పడిపోవాల్సిందే. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే బావికి రక్షణ వలయం ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి

- తక్కువ పెట్టుబడి.. ఎక్కువ ఆదాయం
- మార్కెట్‌లో ఆకుకూరలు, కూరగాయలకు మంచి డిమాండ్
- మారుతున్న రైతుల ఆలోచనలు
- సబ్సిడీపై విత్తనాలు, పురుగు మందులు అందించాలని వినతి



దూదియాతండాలో కూరగాయల సాగులో పనిచేస్తున్న కూలీలు




జానకీనగర్‌లో ఆకుకూరల సాగు

చిలుకూరు : తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో పంటలు పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వేసవిలో ఆకుకూరలు, కూరగాయలకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో మండలంలోని పలు గిరిజన తండాల్లో గిరిజన రైతులు ఆకుకూరలు, కూరగాయల సాగు వైపుకు మొగ్గుచూపుతున్నారు. మండలంలోని జానకీనగర్, దూదియాతండా, శీత్లాతండా, కొమ్ముబండ తండా, సీతరాంతండా గ్రామాల్లో గిరిజన రైతులు ఎక్కువుగా సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో తమకున్న కొద్ది పాటి భూముల్లో బోర్లు, వ్యవసాయ బావుల కింద 5 కుంటలు, 10 కుంటల్లో సాగు చేస్తున్నారు. ఈ సాగులో అధిక దిగుబడులు సాధిస్తూ లాభాలు పొందుతున్నారు. ప్రతి సంవత్సరం ఈ గ్రామాల్లో దాదాపుగా 50మందికి పైగా రైతులు 20ఎకరాల్లో ఈ సాగుపైనే జీవిస్తున్నారు.

స్వయంగా విక్రయాలు..

గిరిజన రైతులు తాము పండించిన పంటను స్వయంగా విక్రయించుకుంటున్నారు. గతంలో దళారులకు అమ్మి తీవ్రంగా నష్టపోయామని అందుకు తామే స్వయంగా అమ్మకుంటున్నామని రైతులు అంటున్నారు. ప్రస్తుతం ఆకు, కూరగాయలను రైతులు ఉదయం మోటార్ బైక్‌లపై మండలంలోని పలు గ్రామాల్లో, హుజూర్‌నగర్, కోదాడ పట్టణాల్లో విక్రయిస్తున్నారు. మహిళలు గంపలతో ఇంటింటికి తిరుగుతూ తండాల చుట్టు ప్రక్కల గ్రామాల్లో అమ్ముతుంటారు. ప్రధానంగా గిరిజన రైతులు గోంగూర, బచ్చలకూర, తోటకూర, పాలకూర, పుదినా, కొత్తిమీరా లాంటి తదితర ఆకుకూరలు, వంకాయలు, దొండకాయలు, బెండకాయలు, దోసకాయలు లాంటి తదితర కూరగాయాలు సాగు చేస్తున్నారు. ఆకు కూరలను ప్రతి పది రోజుల ఒక సారి కోసి కట్టలు కట్టి విక్రయిస్తామని, వర్షాకాలంలో అయితే కట్ట రూ.3నుంచి రూ.5 ఉంటే ప్రస్తుతం వేసవి కాలంలో అదే ఆకుకూర కట్ట రూ.7నుంచి రూ.10వరకు అమ్ముతున్నామని తెలిపారు. కూరగాయాల సాగుకు ఎకరానికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఖర్చు వస్తుందన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి ఆకు, కూరగాయాల సాగు చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు, పురుగు మందులు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.


రోజుకు రూ.500 సంపాదిస్తున్నా



“ప్రతి వేసవి మాదిరిగా ఈ ఏడాది కూడా నాకు ఉన్న 10కుంటల భూమిలో గోంగూర సాగు చేశాను. బావిలో కూడా సరిపడా నీరు ఉండడంతో గోంగూర సాగుకు నీరు సరిపోతున్నాయి. నిత్యం గోంగూర అమ్ముతున్నాను. ప్రతి రోజు రూ.500 వరకు వస్తున్నాయి.

– మాలోతు చంద్య, దూదియాతండా, చిలుకూరు

సబ్సిడీపై విత్తనాలు అందజేయాలి



“ఈ వేసవిలో ప్రస్తుతం బచ్చలకూర, గోంగూర, పాలకూర తదితర ఆకు, కూరగాయలు సాగు చేశాము. ప్రతి రోజు ఆకు, కూరగాయల సాగులో పనిఉంటుంది. పురుగు మందులు పిచికారీ చేయడం, కూరగాయాల సాగులో గడ్డి తీయడం లాంటి పనులు చేస్తున్నాము. రోజుకు రూ.1000 వరకు వస్తున్నాయి. విత్తనాల రేట్లు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందించాలి.

– బోడా బుజ్జి, దూదియాతండా, చిలుకూరు